ప్రజాశక్తి

ఆదివారం 8 జూన్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

వార్త 3లో..



ఆనందపురంలో నేలకొరిగిన బొప్పాయి తోట

ఈదురుగాలులతో భారీ వర్షం

బొప్పాయి, అరటి తోటలు నేలమట్టం

వార్త 8లో..



విశాఖ వన్ టౌన్ ఏరియాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి

- సంక్షేమ పథకాలు అమలు చేయాలి
- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగిన సంఘం సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 42 రోజుల సమ్మె సందర్భంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందన్నారు. సమ్మె కాలంలో కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల జీతాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చిన సంగతిని గుర్తు చేశారు. కానీ ఏడాది గడుస్తున్నా అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించ లేదన్నారు. అందుకే జులై 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న అఖిలభారత సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొని జయప్రదం మిగతా 2లో..



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ



మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం కన్నుమూత



వార్త మెయిన్, టాబ్లాయిడ్ 4లో..

రాష్ట్రపతి విశాఖ పర్యటన వాయిదా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 10న విశాఖలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన వాయిదా పడింది. వాస్తవానికి ఆమె కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. పలు కారణాల వల్ల మొదటి స్నాతకోత్సవాన్ని వాయిదా వేస్తున్నట్టు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం నుంచి శనివారం ఓ ప్రకటన విడుదలైంది. తదుపరి తేదీని త్వరలోనే తెలియజేస్తామని వర్సిటీ అధికారులు పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి

చేయాలని పిలుపునిచ్చారు. రోజురోజుకూ అంగన్‌వాడీలపై పని భారం, రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తామన్న జిఒను నేటికీ ఇవ్వలేదన్నారు. అంగన్‌వాడీ సెంటర్లకు సొంత భవనాలు కేటాయించాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం అర్బన్ ప్రాజెక్టుకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఆర్.ఈశ్వరమ్మ, అధ్యక్షులుగా శోభారాణి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.తులసి, కోశాధికారిగా ఇందిర, ఉపాధ్యక్షులుగా విజయ లక్ష్మి, సహాయ కార్యదర్శులుగా ఎర్రయమ్మ, పార్వతి, కమిటీ సభ్యులుగా శివలక్ష్మి, రాధ, నజ్మా, వల్లి రాణి, పైడికొండ, కుమారి, మహాలక్ష్మి ఎన్నికయ్యారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవి, నాయకులు బృందా, వెంకటలక్ష్మి, పద్మ, పి.మణి పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై.. 9న విశాఖలో నిరసన ర్యాలీ

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు ఆపాలని, ఇప్పటికే తొలగించిన కాంట్రాక్టు కార్మికులందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఈ నెల 9న విశాఖలో జరిగే నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు శనివారం ఓ సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్మికులు వారి పని ప్రదేశాల్లో, అన్ని పరిశ్రమల వద్ద జరిగే కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం నుండి ఉదయం 10 గంటలకు జరిగే స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సంఘీభావ ర్యాలీలో యావత్తు కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాలుగున్నర సంవత్సరాల నుంచి కార్మికులు, ప్రజలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పోరాడుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.11,440 కోట్ల ప్యాకేజీ తీసుకొచ్చినట్టు చెబుతున్నా ఆ డబ్బులన్నీ బ్యాంకు పాత అప్పులు తీర్చడానికి, కేంద్ర ప్రభుత్వ జిఎస్‌టి చెల్లించడానికే వెచ్చించబడ్డాయన్నారు. ప్లాంట్‌కు అవసరమైన ముడిసరుకు, కొత్త యంత్రాలు కొనుగోలు చేసేందుకు, పాతవాటికి మరమ్మతులు చేయడానికి, కార్మికుల బకాయి జీతాలు చెల్లించడానికి ఆ ప్యాకేజీ డబ్బులను ఉపయోగించలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అక్రమంగా కార్మికులను తొలగిస్తోందని చెప్పుకొచ్చారు. ఇప్పటికే 1200 మంది పర్మినెంట్ కార్మికులను విఆర్‌ఎస్ పేరుతో తొలగించారన్నారు. మొదటి విడతలో కాంట్రాక్ట్ కార్మికులు 1600 మందిని, ఇప్పుడు మరొక 1500 మందిని తొలగించారన్నారు. మొత్తంగా కాంట్రాక్టు కార్మికులను 5,600 మందిని తొలగిస్తేనే ప్యాకేజీలో మిగిలిన డబ్బులు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం షరతు పెట్టిందని చెప్పారు. ఈ షరతులన్నీ కూటమి నాయకులకు తెలుసునన్నారు. ఎన్నికలకు ముందు ప్లాంట్ పరిరక్షణకు ప్రాణాలైనా అర్పిస్తానని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ నిరాహార దీక్ష చేశారన్నారు. ఇప్పుడేమో ప్లాంట్ నష్టాలకు కారణం కార్మికులేనని చెబుతున్నారని, ఇది ఎంత వరకూ భావ్యమని పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ నష్టాలకు పాలకుల విధానాలే కారణమన్నారు.

విసిబి నికర లాభం రూ.71.77 కోట్లు



మాట్లాడుతున్న రాఘవేంద్రరావు

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ (విసిబి) ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.71.77 కోట్లు నికర లాభం కలిగి ఉందని విసిబి ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. శనివారం ద్వారకానగర్‌లోని బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 55 బ్రాంచిలు గల తమ బ్యాంకు పరిధిలో 1,11,593 మంది సభ్యులున్నట్లు వివరించారు. విసిబిలో షేరు ధనం రూ.389.55 కోట్లు కాగా, డిపాజిట్లుగా రూ.4354.73 కోట్లు ఉన్నాయన్నారు. కాగా రూ.3436.47 కోట్లు రుణాలు అందించినట్టు తెలిపారు. ఇందులో 95 శాతం కోటి రూపాయల కంటే తక్కువ మొత్తం అందజేశామని పేర్కొన్నారు. సామాన్యులకు ప్రాధాన్యమిస్తూ లక్షా 30 వేల మంది రుణగ్రహీతలకు వారి అవసరాలకు తగినట్లుగా సేవలందిస్తూ వివిధ వర్గాల మన్ననలు విసిబి పొందుతున్నట్టు తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి దాదాపు రూ.7800 కోట్లకు ఆర్థిక లావాదేవీలు చేరుకున్నాయన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరాంతానికి రూ.8600 కోట్లకు ఆర్థిక లావాదేవీల లక్ష్యం కాగా ఈ ఏడాది మరో 5 బ్రాంచి లను ప్రారంభించేందుకు సన్నా హాలు చేస్తున్నామని తెలిపారు.

ఆర్భాటాలు.. ఆర్థిక భారాలు

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

అన్ని దారులూ 'రోమ్ నగరం' వైపే అన్న సామెతను గుర్తుకు తెచ్చేలాగ విన్యాసాలన్నీ 'యోగా' కోసమే అన్నట్టు నగరంలో 'యోగా' వ్యవహారం హల్‌చల్ చేస్తోంది. విశాఖలో ఈ నెల 21న జరుగనున్న, దేశ ప్రధాని మోడీ పాల్గొననున్న అంతర్జాతీయ యోగా డే వైపుగా రాష్ట్ర ప్రభుత్వం అధికారులను, కూటమి నేతలను పూర్తిస్థాయిలో సమాయత్తం చేసింది. దేశ నలుమూలల నుంచి ఈ యోగా కార్యక్రమంలో పాల్గొనేందుకు సాధులు, సన్యాసులు, యోగా బాబాలు ఇలా పలువురు వివిధ రకాల ఆశ్రమ వాసులతో విశాఖ సాగర తీరం జూన్ 21న పెద్ద క్రతువునే తలపింపజేయనుంది. ఇంతటి ఆర్భాటం వెనుక ఆర్థిక భారాలూ ఉన్నాయి.

నగర జనంపై తీవ్ర ఆర్థిక భారం

కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్వహించిన జి – 20 కార్యక్రమమైనా, అందరినీ ఏకతాటిపై నడిపిస్తున్న యోగాంధ్ర క్రతువైనా నగర ప్రజలపై ఆర్థిక భారం పడేసేవే అన్నదాంట్లో ఏ మాత్రం సందేహం లేదు. ఈ యోగాంధ్రను విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21 వరకూ దఫ దఫాలుగా రాష్ట్రంలోని జిల్లాలను, ప్రముఖంగా విశాఖపట్నం జిల్లా అధికార యంత్రాంగాన్ని విడత విడతలుగా సానబడుతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆదివారం పోర్టు కళావాణి స్టేడియంలో జిల్లా అధికార యంత్రాంగం అంతా రిహార్సల్స్‌లో పాల్గొనే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. జూన్ 21న మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విశాఖలో ఈ యోగాంధ్రలో పాల్గొననున్నందున ఆర్‌కె బీచ్



నుంచి భీమిలి తీరం వరకూ సుమారు 2 లక్షల మందిని సమీకరించే ఏర్పాట్లలో అధికారులు, వివిధ శాఖల ప్రభుత్వ సిబ్బంది నిమగ్నమయ్యారు.

గతంలో జి – 20 ఆర్థిక, పారిశ్రామిక సదస్సులకు విశాఖ వేదికయ్యింది. సుమారు రూ.30 కోట్లకు పైగా ఖర్చుచేశారు. వీటిలో జివిఎంసి నిధులే అత్యధికం. తాజాగా రూ.80 నుంచి రూ.100 కోట్లు ఖర్చుచేయనున్నారు. రూ.70 కోట్లకు సంబంధించిన ప్రతిపాదనలు ఇదివరకే సిద్ధం కాగా ఇంకా పెరిగే అవకాశాలున్నాయని అధికార యంత్రాంగం చెబుతోంది. మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి), విఎంఆర్‌డిఎ, ఎపి టూరిజం, ఎపి ఇపిడిసిఎల్, జిల్లా కలెక్టరేట్ ఈ నిధుల వ్యవహారాన్ని చూస్తున్నాయి. అత్యధికంగా జివిఎంసినే భరించాలన్న సంకేతాలను రాష్ట్ర ప్రభుత్వం జారీచేసింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పై నుంచి చేపట్టే ఇలాంటి అధికారిక కార్యక్రమాలు, క్రతువులకు నిధులు సమకూర్చాల్సింది అక్కడ నుంచే. ఈ డిమాండ్‌ను జివిఎంసి నుంచి సిపిఎం, సిపిఐ సభ్యులు చేస్తున్నా మిగతా పార్టీలకు ముఖ్యంగా కూటమికి పట్టడం లేదు. మ్యాట్‌లు, డ్రెస్‌లు, యోగా కిట్‌లు, లైటింగ్, రోడ్ల మరమ్మతులు, రోడ్లకు ఇరువైపులా చెట్ల నరికివేత, బీచ్ రోడ్లన్నీ క్లీనింగ్, ప్రత్యేక యంత్రాంగంతో ఆర్‌కె బీచ్ నుంచి భీమునిపట్నం బీచ్ వరకూ పరిశుభ్రతా కార్యక్రమాలు ఒకటి కాదు సుమారు 110 పనులను ఈ సందర్భంగా యంత్రాంగం చేపడుతోంది.

విశాఖలో జూన్ 21న అంతర్జాతీయ యోగా సక్సెస్ అయితే మోడీ మనసు కరిగి రూ.వేల కోట్లు రాష్ట్రానికి ఇస్తాడన్న కూటమి నేతల ప్రచారం తెరవెనుక సాగుతోంది. జి – 20 అప్పుడూ ఇదే జరిగింది. ఒక్కరూపాయి కూడా ఎపికి, విశాఖకు మోడీ ప్రభుత్వం విదిల్చలేదు.

గ్రేటర్ అభివృద్ధిలో కాంట్రాక్టర్లు కీలకం

ప్రజాశక్తి –ఎంవిపి.కాలనీ: మహావిశాఖ నగరపాలక సంస్థ అభివృద్ధిలో కాంట్రాక్టర్ల దే కీలక పాత్ర అని మాజీ మంత్రి, భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన సివివి నాగరాజు, కార్యదర్శి సంజీవరెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు శనివారం గంటాను ఆయన నివాసం లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తొలుత గంటాను కాంట్రాక్టర్ల అసోసియేషన్ కార్యవర్గం ఘనంగా సత్కరించగా అనంతరం ఆయన నూతన అధ్యక్ష కార్యదర్శులను సత్కరించి వారికి అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వ పరంగా తమ వంతు సహకారం అందిస్తామని నగరాభివృద్ధికి కాంట్రాక్టర్లు తోడ్పాటునందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, నావెల్ డాక్ యార్డ్ కే టి బి అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీను బాబు, పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం




ఆనందపురంలో నేలకూలిన బొప్పాయి

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆనందపురం : ఆనందపురం మండలంలో శనివారం సాయంత్రం కురిసిన వర్షం రైతులకు భారీ నష్టం చేకూర్చింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం మొదలైంది. గంటకుపైగా ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో పలు తోటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆనందపురం గ్రామానికి చెందిన కొట్యాడ శంకర్రావు 30 సెంట్లులో వేసిన బొప్పాయి తోట పూర్తిగా నేలకొరిగింది. ఆయన సోదరుడు కొట్యాడ ఈశ్వరరావు 40 సెంట్లులో వేసిన అరటి తోట కూడా నేలకొరిగింది. బాకురుపాలెం గ్రామంలో గొర్లి తాతప్పుడు ఇంటి సమీపంలో తాడిచెట్టు కూలింది. వేములవలసలో బసవయ్య టీ స్టాల్ సమీపంలో చెట్టు విరిగిపడింది. గంభీరంలో 11 కెవి విద్యుత్ స్తంభం విరిగిపోయింది. కోలవానిపాలెంలో ఎల్‌టి లైన్ స్తంభం కూలడంతో గ్రామంలో విద్యుత్ పూర్తిగా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి కొమ్మలను తొలగించి మరమ్మత్తులు చేపట్టారు. తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాలను పరిశీలించి, అంచనా వేసి, నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని జైజవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుప్ప రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బొప్పాయి, అరటి తోటలు నేలమట్టం - నష్టపోయిన రైతులు

బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాలలో శనివారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటల వరకు అధిక ఉష్ణోగ్రతలతో ఎండ కాసింది. తర్వాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురు గాలులు, పిడుగులు శబ్దం, ఉరుములతో కూడిన భారీ వర్షం దంచి కొట్టింది. కొద్దిరోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజానీకానికి శనివారం నాటి వర్షం ఉపశమనం కలిగించింది. వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. దిబ్బిడి, బుచ్చయ్యపేట, నేతవానిపాలెం తదితరుల గ్రామాల్లో ఈదురు గాలుల వల్ల చెట్లు విరిగి కరెంటు వైర్లపై పడడంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది.



ఈదురు గాలులకు విద్యుత్ వైర్లపై పడ్డ చెట్లు

నేరాలు ఘోరాలు

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- పాయకరావుపేట: మండలంలోని గుంట పల్లిలో నాటుసారాతో పట్టుబడిన వ్యక్తిని అరెస్ట్ చేశామని పాయకరావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఇ సోమయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ టి వెంకట అప్పలనాయుడు, అనకాపల్లి ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సంయుక్తంగా జరిపిన ఈ దాడుల్లో 10 లీటర్లు నాటుసారాతో ఒక వ్యక్తి పట్టుబడగా రిమాండ్ నిమిత్తం యలమంచిలి కోర్టుకు తరలించామన్నారు. సదరు వ్యక్తికి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిందని తెలిపారు. ఈ దాడుల్లో ప్రొహిబిటీషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు పివి గిరి, ఎమ్ఎస్ రాజు, సిహెచ్ మధుసూదనరావు, సంతోష్ పాల్గొన్నారని తెలిపారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : ఆనందపురం 24వ కాలనీకి చెందిన పీతల శ్రీను ఆరోగ్య సమస్యల కారణంగా కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. దీంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులో చిక్కుకుంది. ఈ విషయాన్ని జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్లకు, మండల నాయకుల దృష్టికి స్థానిక జనసేన నాయకులు కుప్ప రామలక్ష్మి తీసుకెళ్లారు. సందీప్ పంచకర్ల ఆదేశాల మేరకు శనివారం పీతల శ్రీను భార్య నాగమణికి ఆనందపురం మండల కమిటీ సభ్యులు సుమారు రూ.40 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు తమ్మిన అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, ఉపాధ్యక్షులు తాడివాడ శివకృష్ణ, కుప్ప రామలక్ష్మి, లోడగల సురేష్, సుబ్బు, బాయిన ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : 37వార్డుకు చెందిన సూరడా దానియమ్మ కుమార్తె ఆత్మహత్య చేసుకున్న కారణంగా ఆమె కుటుంబానికి జనసేన సెంట్రల్ ఆఫీస్ నుంచి వచ్చిన చెక్కును ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఎంఎస్ఎంఇ ఛైర్మన్ శివశంకర్ అందజేశారు. సూరడా దానియమ్మకు రూ.50 వేలు, 38వ వార్డుకు చెందిన మున్నం చంద్రమౌళికి రూ.94,345 చెక్కుల అందజేశారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు ఎగువపేటకు చెందిన బాధితుడు వాసుపల్లి అభినయ్‌కు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజుతో కలిసి సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.60 వేల చెక్కును శనివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంపిపి.కాలనీలోని ఆయన నివాసంలో అందజేశారు. బాధితుడు అనారోగ్యంతో విశాఖ నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఉన్నారు. ఈ మేరకు ఆర్థిక సహాయం చేసినందుకు సిఎం చంద్రబాబుకు, స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు బాధితుని తల్లిదండ్రులు ఆకాశం, శాంతి కృతజ్ఞతలు తెలిపారు.

జనసేనలో సర్పంచ్ చేరిక

ప్రజాశక్తి -మధురవాడ : పద్మనాభం మండలం విలాస్‌ఖాన్‌పాలెం పంచాయతీ సర్పంచ్ నల్లి సత్యవతి, నల్లి బంగారునాయుడు వైసిపి నుంచి జనసేనలో చేరారు. ఎండాడలోని జనసేన పార్టీ కార్యాలయంలో వారికి భీమిలి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ పంచకర్ల సందీప్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ శ్రీనుబాబు, భీమిలి ఎఎంసి ఛైర్మన్ కురిమిన రామస్వామినాయుడు, నాయకులు అక్కరమాని దివాకర్, వి.బి.నాయుడు, కుర్రాయి అనిల్, దేవర శివ, చింతపల్లి సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గరికి వినాయక ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి వాంబేకాలనీలో త్రిముఖ గరికి వినాయక సేవా ట్రస్ట్ ఆధ్వర్యాన త్రిముఖ గరికి వినాయక దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా భీమిలి నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల, భీమిలి ఎమ్మెల్యే గంటా తనయుడు గంటా రవితేజ పాల్గొని దేవస్థానం సభ్యులు నిర్వహించిన అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు జనసేన అధ్యక్షులు నాగోతి నరసింహానాయుడు, పేకెటి శ్రీను, వావిలాపల్లి చిన్న, జగ్గుపిల్లి నాని, టిడిపి నాయకులు గొరే గురునాథ్, నాగోతి శివాజీ, భవాని తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపులతో పరేషాన్

- పలుచోట్ల వికలాంగుల ఇళ్లకు సరుకులు అందించని డీలర్లు

ప్రజాశక్తి-గోపాలపట్నం : కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రేషన్‌లో ఇబ్బందులు తప్పడంలేదని కొందరు అభిప్రాయపడుతున్నారు. వినియోగదారులు, వికలాంగులకు ఇంటి వద్దకే సరుకులు సరఫరా చేస్తామనే ప్రభుత్వ మాటలు రేషన్ డిపో డీలర్లు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జివిఎంసి 89వ వార్డు అప్పలనరసింహనగర్ (చేపలకాలనీ) డిపోలో బెరా అప్పారావు కుటుంబంలో వికలాంగులు ఉన్నారు. రేషన్ సరకులు డిపో నుంచి తెచ్చుకోలేమని ఇంటికి ఇవ్వాల్సిందిగా కోరారు. మీకు నచ్చితే డిపోకు వచ్చి పట్టుకెళ్లండి, లేదంటే మానేయమని డీలర్ సమాధానమిస్తున్నారని అప్పారావు చెబుతున్నారు. జివిఎంసి 92వ వార్డు పరిధి శ్రీరాంనగర్ డిపోలో పతివాడ అప్పన్న 15 కేజీల బియ్యం తీసుకుంటే 13 కేజీలే వచ్చాయని ఆయన చెబుతున్నాడు. రేషన్ డీలర్లతో సమస్యలు వస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం సమీపంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వసతి గృహ సంక్షేమాధికారి ఎస్.రమేష్ తెలిపారు. వసతిగృహంలో ఉండి చదువుకుంటున్న మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులకు గణేష్ నగర్ ఆర్‌హెచ్‌సి ప్రైమరీ స్కూల్, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో చదువుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ వసతి గృహంలో ఎస్‌సి 115, ఎస్‌టి 41, బిసి 109, మైనార్టీలకు 44 సీట్లు ఉన్నాయని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు వసతి గృహ సంక్షేమాధికారి రమేష్ (91548 79173)ను సంప్రదించాలని సూచించారు.

సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాన్ని రూ.32 లక్షలతో ఇటీవల ఆధునీకరించారు. తాగునీటి కోసం రూ.2 లక్షలతో 2వేల లీటర్ల సామర్థ్యం గల ఆర్ఒ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. నివాస గదుల్లో సరిపడా కాంతి, గాలిని అందించే దీపాలు, పంకాలు అమర్చారు. ఆవరణను టైల్స్‌తో సుందరంగా తీర్చిదిద్దారు. మరుగు దొడ్లకు మరమ్మతులు చేయడంతోపాటు భవనానికి రంగులు వేసి తీర్చిదిద్దారు.

ఎపి పోర్టల్ సేవలు తాత్కాలిక నిలిపివేత

ప్రజాశక్తి -ఆనందపురం : గ్రామ/వార్డు సచివాలయ శాఖ ఆధ్వర్యాన నడుస్తున్న ఎపి పోర్టల్ సేవలను మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డేటా సెంటర్‌కు తరలింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు పోర్టల్ సేవలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి తెలిపారు. ఈ కారణంగా ఆదాయ ధ్రువీకరణ, సమగ్ర ధ్రువీకరణ, భూమి మ్యూటేషన్లు, రేషన్/రైస్ కార్డులు, ఇల్లు స్థల పట్టాలు, వృద్ధాప్య పత్రాలు, వివాహ ధ్రువీకరణ, రెవెన్యూ వాటర్ ట్యాక్స్, పట్టణ పరిపాలన సేవలు, మత్స్యశాఖ సేవలు అందుబాటులో ఉండవని వివరించారు. మిగిలిన అన్ని ఇతర ప్రభుత్వ సేవలు మీసేవా కేంద్రాల ద్వారా యథావిధిగా అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు యోగా

ప్రజాశక్తి-యంత్రాంగం

అనకాపల్లి : ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు యోగా నేర్పించాలని జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావునాయుడు అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో శనివారం జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆయుష్ శాఖ సహకారంతో ఉదయం ఏడు గంటలకు విద్యా శాఖ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాలతో యోగాంధ్ర ప్రదర్శన నిర్వహించారు. యోగ గురువు దొరమ్మ నాయుడు, బి అప్పారావు యోగాసనాలు, బ్రీతింగ్ టెక్నిక్స్ చేయించారు. అనంతరం జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు ఆధ్వర్యంలో యోగాపై అవగాహనా ర్యాలీని ఇండోర్ స్టేడియం నుండి చిన్న నాలుగు రోడ్లు కూడలి వరకు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్మాన్ అధికారి డాక్టర్ కె లావణ్య, డిఎస్‌డిఒ రమణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మోటూరు నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకట్రావు, మహలక్ష్మి నాయుడు, ఎంఇఒలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఆయుష్, యోగా విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి విభాగాల ఆధ్వర్యాన యోగాపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి.సురేఖ మాట్లాడుతూ, యోగా ద్వారా కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. యోగాను జీవన విధానంగా అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి వాలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు అభినందనలు

ప్రజాశక్తి -ములగాడ : పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 5వ తేదీన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ నిర్వహించిన సదస్సులో పాల్గొని ప్రతిభ చూపిన సెయింట్ ఆన్స్ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులకు, వాలంటీర్లకు శనివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి మాట్లాడుతూ, 'హరిత పరిసరాలు అవగాహనతోనే సాధ్యం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, ఇతర ప్రోగ్రాం అధికారులు వై.అనసూయాదేవి, వి.అంజలీదేవి, ఎ.సంధ్యారాణి, ఎస్.నదియా అభిప్రాయాలు తెలిపారని, అవి పలువురి ప్రశంసలను అందుకున్నాయని చెప్పారు. సదస్సులో కళాశాలకు చెందిన 20 మంది వాలంటీర్లు పాల్గొని క్విజ్, పెయింటింగ్‌లో బహుమతులను పొందారని తెలిపారు. ఈ సందర్భంగా వీరందరినీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ కేస్లిన్ తదితరులు పాల్గొన్నారు.

7వ వార్డు సమస్యలపై వినతి

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని సమస్యలపై ఇన్‌ఛార్జి కమిషనర్ హరేంధిరప్రసాద్‌కు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ వినతిపత్రం అందించారు. వార్డు పరిధిలో పలు అంతర్గత రహదారులు, డ్రైనేజీ, పార్కులు, విధిదీపాలు వంటి పలు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఇప్పటికే సంబంధిత అధికారులు అంచనాలు తయారుచేశారని, వాటిని ఆమోదించాలని కోరారు.



వార్డు సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ మంగమ్మ



రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

రామారావు సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి -గాజువాక : సిపిఐ సభ్యుడు, గాజువాక మార్కెట్ చిల్లర వర్తకుల సంఘం అధ్యక్షులు ఎం.రామారావు సేవలు ఎనలేనివని వక్తలు కొనియాడారు. గాజువాకలో శనివారం రామారావు సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా రామారావు చిత్రపటానికి సిపిఐ నాయకులు, వర్తక సంఘం ప్రతినిధులు, విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, రామారావు సిపిఐ సభ్యునిగా పనిచేస్తూనే, గాజువాక మార్కెట్ చిల్లర వర్తకుల సంక్షేమం కోసం కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పి.దుర్గారావు, గద్దయ్య, వర్తక సంఘం ప్రతినిధులు పప్పు అప్పారావు, దొడ్డి మల్లేశ్వరరావు, కర్రి వెంకటేశ్వరరావు, కో-ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, రామారావు కుమారుడు ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

రైల్వే న్యూకాలనీలో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు శనివారం నాకా బందీ నిర్వహించారు. ఈస్ట్ సబ్ డివిజన్ సిబ్బంది సాయంతో రైల్వే న్యూ కాలనీ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కార్డన్ అండ్ సెర్చ్‌లో భాగంగా సిఐ సత్యనారాయణ ఆధ్వర్యాన పోలీసులు క్షుణ్ణంగా సోదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో ఒసిటి పరికరాలు

ప్రజాశక్తి- వేపగుంట : నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ ఐ హాస్పిటల్‌లో శనివారం ఆప్టికల్ కోహరెన్స్ టోమోగ్రఫీ (ఒసిటి) పరికరాలను విశాఖపట్నం పోర్టు అథారిటీ డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే ప్రారంభించారు. ఆసుపత్రిని సందర్శించిన దుర్గేష్ కుమార్‌కు శంకర్ ఫౌండేషన్ సమాజానికి అందించే సౌకర్యాలు, సేవల గురించి, రెటినా విభాగం హెచ్‌ఒడి డాక్టర్ టి.కృష్ణ వివరించారు. ఆప్టికల్ కోహరెన్స్ టోమోగ్రఫీ కంటి ఆసుపత్రులలో రెటీనా అధిక-రిజల్యూషన్ క్రాస్-సెక్షనల్ చిత్రాలను పొందడానికి ఉపయోగించే నాన్-ఇన్వాసివ్ ఇమేజింగ్ టెక్నాలజీ అని తెలిపారు. ఇది గ్లకోమా, డయాబెటిక్ రెటినోపతి, వయస్సు-సంబంధిత మాక్యులర్ డీజెనరేషన్ వంటి వివిధ కంటి పరిస్థితులను నిర్ధారించడానికి, పర్యవేక్షించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, డిజిఎం వి.రమేష్‌కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు పాల్గొన్నారు.

గురిందపల్లి అల్మా బెరెకకు అవార్డు

ప్రజాశక్తి -ములగాడ : ఆన్ సంగ్ హీరోస్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యాన గురిందపల్లి అల్మా బెరెకకు 'మల్టీ టాలెంటెడ్ విమెన్, బెస్ట్ సింగర్ ఆఫ్ ది ఇయర్-2025" అవార్డును సిటీ పోలీస్ కమిషనర్ ద్వారా శనివారం ప్రదానం చేశారు. అల్మా బెరెక ఇప్పటికే బెస్ట్ ఫ్యాషన్ అచీవర్ - 2025, మిస్సెస్ తెలంగాణ - 2024, బెస్ట్ టాలెంట్ ఇన్ మిస్సెస్ ఇండియా-2024, బెస్ట్ రాంప్ వాక్ ఇన్ మిస్సెస్ ఇండియా-2024, బ్రైడ్స్ ఆఫ్ ఇండియా - 2024 (రన్నర్‌అప్) తదితర అవార్డులను ఇప్పటికే సాధించారు.



బెస్ట్ సింగర్ అవార్డుతో అల్మా బెరెక

పల్లా సింహాచలానికి ఘన నివాళి

భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించిన మంత్రులు, ప్రముఖులు

ప్రజాశక్తి - సీతమ్మధార, గాజువాక : అనారోగ్యంతో శనివారం మృతిచెందిన టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తండ్రి, విశాఖ - 2 మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. సీతంపేట పరిధి రాజేంద్రనగర్‌లోని వారి నివాసంలో ఉంచిన భౌతిక కాయాన్ని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, పలు పార్టీల నాయకులు, యాదవ సంఘం నేతలు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. సిఎం చంద్రబాబు సంతాపం ప్రకటించారు. సింహాచలం కుమారుడు, గాజువాక ఎమ్మెల్యే అయిన పల్లా శ్రీనివాసరావుకు ఫోన్ చేసి పరామర్శించారు. కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సింహాచలం భౌతిక కాయం వద్ద నివాళ్లర్పించిన వారిలో రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, గణబాబు, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకటరామయ్య, పీలా గోవింద సత్యనారాయణ, మానం ఆంజనేయులు, మాజీ మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, స్థానిక వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ సహా పలువురు కార్పొరేటర్లు, పట్టణ ప్రముఖులు ఉన్నారు. మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సింహాచలం అంత్యక్రియలు ఆదివారం జరుగనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఉదయం నుంచి కొత్త గాజువాకలోగల ఎలిమెంటరీ స్కూల్ సమీపంలో ఉన్న సింహాచలం పాత ఇంటిదగ్గర ప్రజల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచి, 11 గంటలకు అంతిమయాత్ర చేపట్టనున్నామన్నారు.



పల్లా సింహాచలం భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

శ్రీభారతి విద్యానికేతన్‌లో ఐఐటి ఫౌండేషన్



ప్రజాశక్తి - ఆనందపురం: గ్రామీణ ప్రాంత విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేయడమే లక్ష్యంగా శ్రీభారతి విద్యానికేతన్‌లో 6వ తరగతి నుంచి ఐఐటి ఫౌండేషన్ తరగతులు ప్రారంభించామని పాఠశాల కరస్పాండెంట్ దొంతల రామారావు తెలిపారు. విద్యార్థుల మెరుగైన భవిష్యత్తు కోసం ప్రణాళికాబద్ధంగా కోర్సులను రూపొందించామని, అర్హత కలిగిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా బోధన అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రగతిని దృష్టిలో ఉంచుకొని ఫలితాల ఆధారంగా బోధన శైలిని రూపొందించి, అంశాలపై లోతైన అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. పాఠశాలలో ఇప్పటికే డిజిటల్ తరగతులు, ప్లే వే పద్ధతిలో బోధన, ఆంగ్లభాషా నైపుణ్యాల అభివృద్ధి, కంప్యూటర్ శిక్షణ, శారీరక విద్యలో భాగంగా కరాటే, యోగా, క్లాసికల్, వెస్ట్రన్ డ్యాన్స్ శిక్షణ, డిజిటల్ లైబ్రరీ వంటి ఆధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

ప్రతి నెలా తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి, విద్యార్థుల అభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందిస్తున్నామని చెప్పారు. పెద్ద ఆట స్థలం, క్రీడలకు ప్రోత్సాహం, కమ్యూనికేషన్ స్కిల్స్ శిక్షణ ద్వారా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి పాఠశాల కట్టుబడి ఉందన్నారు.

గత విద్యా సంవత్సరాల్లో ఎస్-ఎస్‌సి పరీక్షల్లో 100 శాతం ఫలితాలు సాధించిందని చెప్పారు. ఈ సంవత్సరం సీట్లు పరిమితంగా ఉండటంతో తల్లిదండ్రులు ముందుగానే అడ్మిషన్లు ఖరారు చేసుకోవాలని సూచించారు.



కరస్పాండెంట్ రామారావు

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి- వేపగుంట : సింహగిరిపై అప్పన్న దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. వేకువ జాము నుంచి భక్తులు సింహగిరిని చేరుకోవడంతో ఆలయ కార్యనిర్వహణాధికారి వెంద్ర త్రినాధరావు భక్తులకు కావలసిన సౌకర్యాలను కల్పించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీరు, మజ్జిగ, చిన్నపిల్లల కోసం పాలు బిస్కెట్లు పంపిణీ చేయించారు. కేశఖండన, ప్రసాదాలు రూ.100, రూ.300, ఉచిత క్యూలైన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు త్వరితగతిన దర్శనాలు కలిగేలా చర్యలు తీసుకున్నారు. ఆలయం, ప్రసాద కౌంటర్లు, గోపురం పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా శానిటేషన్ పనులను పరిశీలించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బందారు రాంబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డివిఎస్.రామరాజు, ఎఇఒ రమణమూర్తి, పిల్లా శ్రీనివాసు తదితరులు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారు.

'అసెంట్'లో పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

ప్రజాశక్తి -ఆనందపురం : పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడమే ధ్యేయంగా అసెంట్ పాఠశాలను స్థాపించినట్లు కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపల్ కొలగాని శంకరరావు తెలిపారు. పాఠశాలను ప్రారంభించిన తక్కువ కాలంలోనే అందరి అభిమానాన్ని పొంది ఉన్నత స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో గ్రామీణ ప్రజలు తమ పాఠశాలపై ఆదరాభిమానాలు చూపిస్తున్నారని తెలిపారు. మండలంలోని పాలవలస గ్రామంలో ఆనందపురం- బాకూరిపాలెం రోడ్డు మార్గంలో 2017లో అసెంట్ పాఠశాలను ప్రారంభించినట్లు చెప్పారు. పాఠశాలలో నర్సరీ నుంచి 9వ తరగతి వరకు ప్రస్తుతం 668 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఈ ఏడాది నుంచి పదో తరగతికి కూడా అనుమతి వచ్చిందన్నారు. పాఠశాలలో సుమారు 50మంది పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్నామన్నామని తెలిపారు. కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నామన్నారు. విద్యతోపాటు కరాటే, యోగా, ఆటలలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. చౌక్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొని సెమీస్ వరకు వెళ్లారని తెలిపారు. చౌక్ బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన చుక్క పార్థు (9వ తరగతి) ఆంధ్ర టీం అండర్ 14, అండర్ 19 కెప్టెన్‌గా ఎంపికయ్యారన్నారు. తిమ్మనాని జగన్ (8వ తరగతి), ఈగల రామ్‌చరణ్ (9వ తరగతి), వెన్నెి ఉమా మహేష్ (9వ తరగతి) చౌక్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని వివరించారు.

ఇటీవల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో జరిగిన జోనల్ మీట్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు రన్నర్స్ గాను, క్రికెట్‌లో మొదటి స్థానం, ఖోఖోలో బాలికలు మొదటి స్థానం, త్రో బాల్, రన్నింగ్ పోటీల్లో రెండో స్థానం సాధించారని తెలిపారు.

విద్యతోపాటు నవోదయ, ఐఐటి, తదితర పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. దూర ప్రాంత విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు.





కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపల్ కొలగాని శంకరరావు

పని గంటల పెంపుపై నిరసనల వెల్లువ



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలోని కార్మికుల పని గంటలు పెంచుతూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా శనివారం జిల్లాలోని పలు చోట్ల సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

అనకాపల్లి : కార్మికుల పని గంటలు పెంపుపై అనకాపల్లి ఆర్టీసీ డిపో వద్ద శనివారం ఏపీఎస్ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ హయ్యర్ బస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందని, ఈ లేబర్ కోడ్స్ అమలులో భాగంగా ఎపి ప్రభుత్వం ఎనిమిది గంటల పనిని 12 గంటలకు, ఓటిని మూడు నెలలకు 144 గంటలకు, రాత్రిపూట నైట్ షిఫ్ట్ డ్యూటీలు మహిళలకు వెయ్యవచ్చని రాష్ట్ర మంత్రి వర్గం తీర్మానించి ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. ఇవి కార్మిక వర్గానికి తీవ్రంగా నష్టం కలిగిస్తాయని, కార్మికుల శ్రమ దోపిడీ చేయడమే అవుతుందన్నారు. టిడిపి ప్రభుత్వం ఇప్పటికీ షెడ్యూల్ ఎంప్లాయిస్ వేతనాలు పెంపు జీవో ఇవ్వలేదని, దీంతో గత 14 సంవత్సరాలుగా వేతనాలు పెరగడం లేదని తెలిపారు. స్కీముల్లోనూ, కాంట్రాక్ట్ వర్కర్లుగా పని చేస్తున్న వారికి భద్రత లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలక సత్యనారాయణ, ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి పిఎన్‌వి.పరమేశ్వరరావు, నూకరాజు, నానాజీ, నర్సింగరావు కళ్యాణ్, సత్తిబాబు నాగేశ్వరరావు సంతోష్ తదితర అద్దె బస్సుల కార్మికులు పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో మాట్లాడుతున్న సిఐటియు నేత రాము

పరవాడ : రాష్ట్రంలో కార్మికుల పనిగంటలు పెంచుతూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం పరవాడ సినిమా హాల్ జంక్షన్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 8 గంటల పని కోసం 1886 చికాగో నగరంలో పోరాడి సాధించుకున్న కార్మికవర్గంపై 12 గంటల పనిని రుద్దుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజా వ్యతిరేకమని పేర్కొన్నారు. కార్మికుల రక్తమాంసాలు పిండి కార్పొరేట్‌లకు ఇబ్బడిముబ్బడిగా లాభాలు కట్టబెట్టేందుకే చంద్రబాబు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది మండిపడ్డారు. కార్మికవర్గం ఐక్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఈ దాడిని ప్రతిఘటించాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిహెచ్ వెంకనాయుడు, కె.అర్జున్, ఎన్.గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చుతాపురం : సిఐటియు ఆధ్వర్యంలో అచ్చుతాపురంలో శనివారం కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కన్వీనర్ కె.సోమునాయుడు మాట్లాడుతూ డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఎస్ఇజెడ్, ఫార్మా రంగం వంటి పరిశ్రమల్లో మహిళలతో రాత్రి వేళలో పనిచేయించడానికి వీలుగా కంపెనీలకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో మారిశెట్టి అప్పారావు, బోరా శంకర్రావు, వాసుపల్లి కాసుబాబు, నూకమ్మ, దర్గా, నాగమణి పాల్గొన్నారు.



పరవాడలో...

మధురవాడ : రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 12 గంటలు పనిదినాన్ని అమలు చేస్తామనడం దుర్మార్గం అని సిఐటియు మద్దిలపాలెం జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు అన్నారు. ఈ మేరకు జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను కాలరాయాలని చూస్తే కార్మిక వర్గం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్యకర్తలు బి.నరసింగరావు, టి.జాన్, కె.అచ్చియ్యమ్మ, చిన్న, బి.దుర్గ, యు.ఆదిలక్ష్మి, ఎం.రమణ, బాలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : 8 గంటలుగా ఉన్న పని విధానాన్ని 12 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు డిమాండ్ చేశారు. శనివారం పూర్ణా మార్కెట్ స్ప్రింగ్ రోడ్డులో 12 గంటల పని విధానాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యాన ముఠా కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మోడీకి భజన చేస్తూ ఆయన విధానాలను రాష్ట్రంలో అత్యంత వేగంగా అమలు చేయడానికి పూనుకున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మధురవాడ జివిఎంసి జోనల్ కార్యాలయం వద్ద

విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు





సబ్బవరం ప్రతిభా విద్యాలయం విద్యార్థులు గ్రీష్మంత్ చరణ్, గొర్లి యజ్ఞశ్రీ, గల్లా గీత చంద్రిక





చోడవరం విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మోనిస, డోల హారిని, పవన్ కుమార్ నాయుడు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఈ ఏడాది పదోతరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ షైనింగ్ స్టార్ అవార్డులు ప్రకటించింది. ఈ అవార్డులకు జిల్లాలోని పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు.

ప్రతిభా విద్యాలయం విద్యార్థులకు..

సబ్బవరం : స్థానిక ప్రతిభా విద్యాలయం విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు లభించినట్లు కరెస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 'షైనింగ్ స్టార్' అవార్డుకు మండలం నుండి ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేయగా అందులో ముగ్గురు విద్యార్థులు ప్రతిభా విద్యాలయానికి చెందిన వారే కావడం గర్వకారణమన్నారు. తమ పాఠశాలకు వంక గ్రీష్మంత్ చరణ్, గొర్లి యజ్ఞశ్రీ, గల్లా గీత చంద్రికలు ఈ అవార్డులకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రమణతో పాటు ప్రిన్సిపాల్ అన్సీ జోసెఫ్, డైరెక్టర్ శరత్ తేజ, హెచ్ఎం కనకమహాలక్ష్మి ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ నుండి ముగ్గురు...

చోడవరం : పదవ తరగతిలో మంచి మార్కులతో ప్రతిభ కనబరిచిన చోడవరం విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులను ప్రతిభా పురస్కారం (షైనింగ్ స్టార్ అవార్డు)కు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ ఎంఎంకె రాజు తెలిపారు. ఎడ్ల మౌనిష, పచ్చర్ల డోలహారిని, కాశీపల్లి పవన్ కుమార్ నాయుడు ఈ అవార్డుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రిన్సిపల్ జ్ఞానేశ్వరి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బుచ్చయ్యపేట మండలంలో 8 మంది..

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ ఏడాది పదోతరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ మార్కులు పొందిన ఎనిమిది మంది విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వ షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈఓ-2 బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు శనివారం తెలిపారు. విజయరామరాజుపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థి కాండ్రేగుల శంకర్(581), బంగా మనోహర్ (557), వడ్డాది కేపిడి జడ్పీ హైస్కూల్‌కి చెందిన సింగిడి సాయి కుసుమ (578), బొంకుల ఈశ్వర ప్రసాద్ (530), సీతయ్యపేట జెడ్పీ హైస్కూల్‌కి చెందిన కొండపల్లి శ్రీలక్ష్మి (578), గోకివాడ విజయ జ్యోతి (578), జనపు రెడ్డి ప్రవీన్ (573), వడ్డాది పీఎంఎన్ మోడల్ హైస్కూల్‌కి చెందిన పదిలం ఉషారాణి (564) ఈ అవార్డులకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరికి ఒకొక్కరికి రూ.20 వేల నగదు, గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రం త్వరలో అందజేస్తారని వెల్లడించారు.



ఇన్ఫోసిస్‌లో డైట్ విద్యార్థులు

ఇన్ఫోసిస్‌ను సందర్శించిన డైట్ విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖపట్నంలోని ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను స్థానిక డైట్ కళాశాల విద్యార్థులు శనివారం సందర్శించారు. డైట్ ఐఈఈఈ స్టూడెంట్ చాప్టర్‌తో కలిసి పారిశ్రామిక సందర్శనలో భాగంగా విద్యార్థులకు కార్పొరేట్ పని వాతావరణం, పరిశ్రమ పద్ధతులపై సమగ్ర అవగాహన కల్పించింది. విద్యార్థులు ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో ఇన్ఫోసిస్ రిక్రూట్‌మెంట్ బృందంతో ఇంటరాక్టివ్ సెషన్‌లో పాల్గొన్నారు. అక్కడ వారు కంపెనీ సిఎస్ఆర్ చొరవలు, సమ్మిళిత పని సంస్కృతి, నియామక ప్రక్రియలు, ఐటి పరిశ్రమలో ప్రతిభ అంచనాల గురించి తెలుసుకున్నారు. ఇన్ఫోసిస్ విశాఖపట్నం హెడ్ సురేష్ చేసిన స్ఫూర్తిదాయకమైన ప్రసంగం విద్యార్థులను ఆకట్టుకుంది. నేటి పోటీ ప్రపంచంలో అభివృద్ధి చెందడానికి కోడింగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. భవిష్యత్ ఇంజనీర్లకు కీలకమైన లక్షణాలుగా నిరంతర అభ్యాసం, అనుకూలతను స్వీకరించడానికి ఆయన విద్యార్థులను ప్రేరేపించారు. ఈ సందర్శనకు విద్యార్థులు, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ విభాగాధిపతి వెంకటేశ్వరరావు, టిపిఒ హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షునిగా సన్యాసిరావు



ప్రజాశక్తి-చోడవరం : టిడిపి మండల అధ్యక్షుడిగా గజపతినగరం గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి కనిశెట్టి సన్యాసిరావు (మత్స్యరాజు) నియమితులయ్యారు. స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎంఎస్.రాజు సన్యాసిరావు పేరును అధికారికంగా ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి సన్యాసిరావు కుటుంబీకులు పార్టీలో పనిచేస్తున్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా నియామకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి స్థానిక ఎమ్మెల్యే రాజు నియామకం చేశారని, పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేస్తానని సన్యాసిరావు తెలిపారు.

రామాలయం ప్రారంభం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి రామనగర్‌లో కొత్తగా నిర్మించిన రామాలయాన్ని శనివారం ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి పాల్గొని కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు, ఊటుకూటి రమేష్‌నాయుడు, కొఠారు శ్రీనివాసరావు మాస్టారు, ఉదయకుమార్, మాజీ ఎంపిటిసి లంక రాజు, పడాల శ్రీనివాసరావు, దౌవులూరి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

రెహమాన్‌కు భరత్ కుమార్ పరామర్శ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన వికలాంగుల సంఘం నాయకులు షేక్ రెహమాన్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా, విషయం తెలిసిన వైసిపి అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మలసాల భరత్ కుమార్ శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైసిపి నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులుగా షేక్ రెహమాన్‌ను నియామకం చేసినట్లు భరత్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్ రాజా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మలసాల కిషోర్, ఉగ్గినిపాలెం సర్పంచ్ కలగ గున్నయ్య నాయడు, గ్రామ సర్పంచ్ కొట్టే రాము, కొన నాగేశ్వరరావు,షేక్ బాబురావు పాల్గొన్నారు.



రెహమాన్‌తో మాట్లాడుతున్న భరత్‌కుమార్

పట్టణ నడిబొడ్డున రహదారి అధ్వానం

వర్షం పడితే చెరువును తలపిస్తున్న పెరుగు బజారు మార్గం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

జీవీఎంసీలో అనకాపల్లి ఒక భాగమైనా, అనకాపల్లి జిల్లా కేంద్రమైనా పట్టణ నడిబొడ్డున ఉన్న సమస్యలను ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. వ్యాపార కేంద్రం నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించి పెరుగు బజార్ రోడ్డులో ప్రస్తుత పరిస్థితి నరకప్రాయంగా మారింది. వర్షం పడితే అది మరింత తేటతెల్లమవుతుంది. అనకాపల్లి పట్టణంలోని వాణిజ్య కేంద్రంగా పేరుగాంచిన పెరుగు బజార్ ప్రాంతం కొంత కాలంగా తీవ్రంగా నిర్లక్ష్యం పాలవుతోంది. రోడ్డు విస్తరణ పేరిట తవ్వేసి అలా వదిలేశారు. రోడ్డు ప్రమాదకరంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. రోడ్డంతా గోతులతో నిండి చెరువును తలపిస్తోంది. ఈ మార్గంలో నడక సాధ్యం కాని పరిస్థితి ఏర్పడుతోంది. అభివృద్ధి పేరిట కోట్లు ఖర్చు పెడుతున్నామంటూ అధికారులు, నాయకులు చెబుతున్నప్పటికీ, పెరుగు బజార్ రోడ్డును మాత్రం పట్టించుకోవడం లేదు. ఇది ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తోంది. జీవీఎంసీ పరిపాలనలో ఉండి కూడా సమస్యను పరిష్కరించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా, ఈ సమస్యపై కనీస స్పందన లేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. పట్టణంలోనే రోడ్డు స్థితిలో ఇలా ఉంటే మిగతా ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



పెరుగుబజార్ సెంటర్‌లో చెరువును తలపిస్తున్న రోడ్డు

మెరుగైన వైద్య సేవలకు కృషి చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్, ఆసుపత్రి చైర్మన్ విజయ కృష్ణన్ సూచించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం శనివారం కలెక్టర్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాకు ఈ ఆస్పత్రి తలమానికమని, రోజూ ఎంతో మంది రోగులు వస్తున్నారని, వారికి మెరుగైన సౌకర్యాలు అందేలా కృషి చేయాలని కోరారు. హెచ్‌డిసి కమిటీ సభ్యులతో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. సభ్యులుగా ఆళ్ల రామచంద్రరావు, డాక్టర్ డిడి నాయుడు, ఉల్లింగల రమేష్, గొర్లి శేఖర్, తాడి శాంతి కుమారి ప్రమాణం చేశారు. కార్యక్రమంలో నూకాంబిక అమ్మవారి ఆలయ చైర్మన్ నాగ శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై ఎమ్మెల్యే కొణతాల ఆరా

ఎన్టీఆర్ ఆసుపత్రిలో వైద్య సేవలపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆరా తీశారు. ఆస్పత్రిలో పలు వార్డులను పరిశీలించారు. మహిళ ప్రసూతి విభాగాన్ని పరిశీలించి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

పారదర్శకంగా డిఎస్‌సి నిర్వహించడం అభినందనీయం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : మెగా డీఎస్సీ పరీక్షలను విశాఖ అనకాపల్లి జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పారదర్శకంగా నిర్వహించడం అభినందనీయమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో నిరుద్యోగ యువతీ యువకులకు ఇచ్చిన మాట ప్రకారం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించి పరీక్ష నిర్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ పాటిస్తామని జగన్ రెడ్డి మాటలు కోటలు దాటేయే తప్ప ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు బోడి వెంకటరావు, మళ్ల శివన్నారాయణ, కాండ్రేగుల ముకుంద, గొంప మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో ఐదు మేకలు మృతి

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో వీధి కుక్కలు దాడి చేయడంతో గ్రామానికి చెందిన కురందాసు నాయుడుకు చెందిన 5 మేకలు మృతి చెందాయి. పొలంలో మేత ముగించిన అనంతరం మేకలను శుక్రవారం సాయంత్రం పాకలో ఉంచారు. శనివారం ఉదయం చూసేసరికి మేకలు గాయాలతో రక్తస్రావంతో మృతి చెంది ఉన్నాయి. రాత్రి వేళ కుక్కలు దాడి చేయడంతోనే తన మేకలు మృతి చెందాయని బాధితుడు నాయుడు తెలిపారు. రూ.35వేలు మేరకు నష్టం వాటిల్లిందని, తమను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని మనుషులు, మూగజీవాలపై తరచూ దాడి చేసి గాయపరుస్తున్నాయని, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. గతంలో కూడా కుక్కల దాడిలో పలువురి మేకలు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి.

ఉపాధి హామీ వేతన బకాయిలు విడుదలకు కృషి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వెన్నెలపాలెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు నాలుగు వారాలుగా బకాయి ఉన్న కూలి డబ్బులు విడుదలకు కృషి చేస్తానని ఆ గ్రామ ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి కూలీలను కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న విశాఖ బీచ్ రోడ్‌లో భారీ స్థాయిలో జరుగు యోగాడే కార్యక్రమంలో ఎక్కువ మంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్‌పి జి.గంగనాయుడు, మేట్లు, వర్కర్లు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వెన్నెల సన్యాసిరావు

9న విజన్ యాక్షన్ యూనిట్లు ప్రారంభం

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న విజన్ యాక్షన్ యూనిట్లను 9వ తేదీ సోమవారం ప్రారంభించడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, నియోజకవర్గం కేంద్ర మండల అభివృద్ధి అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాసనసభ నియోజకవర్గ మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న విజన్ యాక్షన్ యూనిట్లను శాసన సభ్యులచే ప్రారంభించుటకు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ యూనిట్‌కు శాసనసభ్యులు చైర్మన్‌గా వ్యవహరిస్తారని, నియోజవర్గ ప్రత్యేక అధికారి, కేటాయించిన ఐదుగురు సిబ్బంది యూనిట్లో ఉంటారని పేర్కొన్నారు. యూనిట్‌లకు కేటాయించిన సిబ్బంది వెంటనే రిపోర్టు చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న విజన్ యాక్షన్ యూనిట్లు సోమవారం నుండి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు కొనసాగించాలని తెలిపారు. యూనిట్ ఏర్పాటుకు కావలసిన వసతి, ఫర్నిచర్, కంప్యూటర్లు సమకూర్చవలసిందిగా మండల అభివృద్ధి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రణాళిక అధికారి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

వైసిపి నుండి జనసేనలోకి భారీగా చేరికలు



పెందుర్తి ఎమ్మెల్యే సమక్షంలో జనసేన కండువాలు కప్పుకున్న నేతలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైసిపి నేతలు సుమారు 400 మంది జనసేన పార్టీలో చేరారు. మండలంలోని ఇరువాడ దరి ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సమక్షంలో వారంతా జనసేనలో చేరారు. వారికి ఎమ్మెల్యే రమేష్‌బాబు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. జనసేన పార్టీలో చేరిన వారిలో సబ్బవరం-2 ఎంపిటీసీ బైలపూడి దేముడుతో పాటు 60 మంది, అమృతపురం ఎంపిటీసీ సింగంపల్లి శ్రీనివాసరావుతో పాటు 110 మంది, నారపాడు ఎంపిటీసీ వైస్ ఎంపిపి- 2 మామిడి లక్ష్మి కొండాజీతో పాటు 55 మంది, సబ్బవరం మేజర్ పంచాయతీ నుండి 35 మంది, గాలి భీమవరం పంచాయతీ నుండి 36 మంది, అయ్యన్నపాలెం పంచాయతీ నుండి 20 మంది, వంగలి పంచాయతీ నుండి పది మంది, బాటజంగాల పాలెం ఉపసర్పంచ్ షేక్ మదీనా, బోలెం శంకర్‌తో పాటు 40 మంది వైసీపీ నుండి జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ వర్గ బేధాలు, గొడవల జోలికి పోకుండా తమ పార్టీలోకి చేరిన వారిని తన అన్నదమ్ములుగా కలుపుకొని పనిచేస్తామని హామీ ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచులు, ఎంపిటీసీలు, జడ్పిటిసిల సీట్లు గెలిపించాలని, వైసిపిని ఖాళీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు, కర్రి కనకరాజు, గండి దుర్గాప్రసాద్, శరగడం రాము, బలిరెడ్డి రామకృష్ణ, గొర్లి కుమారస్వామి, బంతికోళ్ల పద్మ, పల్లా రమణ, సబ్బవరపు రమణ, గొర్లి నూకరాజు, బోకం స్వామి నాయుడు, కర్రి నరసింగరావు, టి శేఖర్, జెట్టి ప్రసాద, పల్లి మంగరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సిమెంట్ విరాళం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని నర్సింగబిల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో దశావతారాల విగ్రహాలు నిర్మాణానికి బయ్యవరం సాగర్ సిమెంట్ యాజమాన్యం రూ.75 సిమెంట్ బస్తాలు విరాళంగా శనివారం కమిటీకి అందజేసింది. ఈ కార్యక్రమంలో ఆలయం కమిటీ నాయకులు పాల్గొన్నారు.

పలు ఉద్యానవన పంటలకు రాయితీలు



సాయిప్రియ

ప్రజాశక్తి-యలమంచిలి : పలు ఉద్యానవన పంటలకు రాయితీలు అందిస్తున్నట్లు హార్టికల్చర్ అధికారి సాయిప్రియ తెలిపారు. శనివారం యలమంచిలి డివిజనల్ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో తనను కలిసిన ప్రజాశక్తితో ఆమె మాట్లాడారు. యలమంచిలి కేంద్రంగా ఉన్న తమ కార్యాలయం ద్వారా యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో పంటల సాగు విధానాలపైనా, ప్రభుత్వ పథకాలపైనా రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు ఇస్తున్నట్లు చెప్పారు. కృషి వికాస యోజన ద్వారా కొత్తగా మామిడి సాగు చేసేవారికి హెక్టారుకు రూ.7,980 రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. జీడిమామిడికి రూ.18వేలు, బొప్పాయికి రూ.18వేలు, జామకు రూ.48వేలు డ్రాగన్ ఫ్రూట్‌కు రూ.1,62,000 అందిస్తామన్నారు. రెండు, మూడు సంవత్సరాల్లో కూడా సాగు ఖర్చులో 30 - 40 శాతం రాయితీ అందిస్తామని వివరించారు. కూరగాయల సాగును ప్రోత్సహించడానికి, ఆధునిక పద్ధతుల్లో కూరగాయల సాగు చేసే రైతులకు మల్చింగ్ షీట్, దడులు కట్టడం తైవాన్ బ్యాటరీ స్ప్రేయర్ మొదలైనవి సమకూర్చుకోవడానికి హెక్టారుకు రూ.24వేలు రాయితీ అందిస్తున్నామని తెలిపారు. శాశ్వత పందిర్లు సిమెంట్ స్తంభాలతో నిర్మించుకుంటే హెక్టారుకు ఒక్కో రైతుకు లక్ష రూపాయల రాయితీగా అందిస్తామని చెప్పారు. ఈ రాయితీల గురించి రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. ఆరు మండలాల్లో జీడి మామిడి 12,340 ఎకరాల్లోనూ, కొబ్బరి, 16,883 ఎకరాల్లోనూ, కూరగాయలు 395 ఎకరాల్లోనూ సాగుచేస్తున్నట్లు చెప్పారు. ఎస్.రాయవరం మండలంలో తమలపాకు తోటలు 25 ఎకరాల్లోనూ, పాయకరావులో975 ఎకరాల్లోనూ సాగు చేస్తున్నట్లు తెలిపారు. హార్టికల్చర్ సాగు పట్ల ఆసక్తి గల రైతులకు పొలంలోనే స్టోరేజ్ గొడౌన్లు నిర్మించుకోవడానికి 600 స్క్వేర్ ఫీట్‌కు సుమారు రూ.2 లక్షలు రాయితీ ఇస్తున్నట్టు హార్టికల్చర్ ఆఫీసర్ సాయిప్రియ తెలిపారు.

రేషన్‌కు నగదు బదిలీ ఆలోచన విరమించుకోవాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్)లో రేషన్‌కు బదులు నగదు బదిలీ ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి వెంకన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పిడిఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు చట్టం ప్రకారం 14 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేయవలసి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం, పదే పదే రేషన్ అవసరం లేకపోతే డబ్బులు తీసుకోవచ్చునని లబ్ధిదారులను ప్రోత్సహించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికే సంవత్సరానికి ఉచితంగా ఇస్తామన్న మూడు గ్యాస్ సిలిండర్ల డబ్బులు 90 శాతం మందికి పడటం లేదని తెలిపారు. రేషన్ కూడా నగదు బదిలీ అమలు జరిగితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగలేదని ప్రజాపంపిణీ వ్యవస్థను పూర్తి నిర్వీర్యం చేయాలని చూస్తుందని విమర్శించారు. కేరళ రాష్ట్రం తరహాలో మూడు కార్డుల విధానం అమలు చేయాలని, అక్కడ ఇస్తున్న విధంగా లబ్ధిదారులకు 17 రకాల నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. రేషన్ అందని మారుమూల గిరిజన గ్రామాలకు ఎండియు వ్యవస్థను కొనసాగించి రేషన్ సరఫరా చేయాలని కోరారు.

'మధ్యాహ్న' నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ మెయిన్ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ప్రసన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారం చేసి, వేతనాలు అమలు చేయాలన్నారు. అనంతరం నర్సీపట్నం మధ్యాహ్న భోజన నిర్వాహణ సంఘం మండల కమిటీ ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షులుగా జల్లూరు నాగరాజు, కార్యదర్శిగా సత్యవేణి ఉపాధ్యక్షులుగా నూకరత్నం సహాయ కార్యదర్శిగా లావణ్య, కోశాధికారిగా కుమారి, మండల కమిటీ సభ్యులుగా లవ కుమారి, వరలక్ష్మి, లక్ష్మి, చింతల్లి, లక్ష్మి లను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం సంఘం కోసం నిరంతర పోరాటం చేస్తామన్నారు. ఎన్నుకున్న సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.



నినాదాలు చేస్తున్న నిర్వాహకులు

పచ్చిరొట్ట ఎరువుతో బహుళ ప్రయోజనాలు



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

ప్రజాశక్తి -కోటవురట్ల:పచ్చిరొట్ట ఎరువులతో బహుళార్ధ ప్రయోజనాలు చేకూరుస్తాయని బిసిటి కృషి విజ్ఞాన్ శాస్త్రవేత్త వి ప్రసాద్ రావు అన్నారు, వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం అన్నవరం ఎండపల్లి బికేపల్లి గ్రామాలలో పచ్చిరొట్ట ఎరువుల వినియోగం వాటి ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు, రానున్న ఖరీఫ్ సీజన్ లో ప్రతి ఒక్కరు జనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట సాగు చేసి భూమిలో కలియదున్నాలన్నారు.దీంతో భూమి సారవంతం అవుతందన్నారు.పచ్చిరొట్ట ఎరువు నీటిని భూమిలో నిల్వ ఉంచేందుకు సహకరిస్తుందని, నేల సారవతం అవుతుందని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రాంబాబు, వ్యవసాయ సహాయకులు హరికృష్ణ, గంగ త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగంపై అవగాహన

నక్కపల్లి:వాణిజ్య పంటల సాగులో డ్రోన్ వినియోగాన్ని పెంచడం ద్వారా చీడపీడలను సకాలంలో తక్కువ ఖర్చుతో అదుపులో ఉంచవచ్చని వాణిజ్య పంటల పరిశోధన సంస్థ (రాజమండ్రి) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె. ప్రభాకర్ రావు రైతులకు సూచించారు. వికసిత కృషి సంకల్ప అభయాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలో శనివారం దోసలపాడు, రేబాక, డి.ఎల్. పురం గ్రామాల్లో బిసిటి-కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో, వ్యవసాయ శాఖ సహకారంతో శాస్త్రవేత్తలు, అధికారులు రైతులతో సమావేశం నిర్వహించి వాణిజ్య పంటల సాగు పై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు సరైన మోతాదులో వాడుతూ జీవ నియంత్రణ పద్ధతులను అవలంబించాలని సూచించారు. చిరుధాన్యాలను కనీసం ఇంటికి సరిపడా సాగు చేసుకుని, భోజనంలో ఒక పూట తప్పనిసరి చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శివ మాట్లాడుతూ, మామిడి, బొప్పాయి, కూరగాయల పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు.బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం, సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, నవధాన్య పచ్చిరొట్ట ఎరువుల ప్రయోజనాలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పలు రకాల సేవలకు అంతరాయం

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రభుత్వ సూచనల మేరకు గ్రామ/ వార్డు సచివాలయ శాఖ నిర్వహిస్తున్న పలు సేవలు 10వ తేదీ మంగళవారం రాత్రి వరకు నిలుపుదల చేయడంతో సేవలకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు గమనించాలని ఎంపీడీవో డి సీతారామరాజు తెలియజేశారు.గ్రామ/వార్డు సచివాలయ శాఖ నిర్వహిస్తున్న ఏపీ సేవ పోర్టల్‌ను మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డేటా సెంటర్ కి తరలింపు (మైగ్రేషన్) చేపడుతుందని, ఈ నిమిత్తం 7 వ తేదీ శనివారం ఉదయం నుండి 10 వ తేదీ మంగళవారం రాత్రి వరకు ఏపీ సేవ పోర్టల్ ద్వారా అందించు సేవలు నిలుపుదల చేయడమైందన్నారు. ఈ కారణంగా ఆదాయ ధ్రువీకరణ పత్రం, సమగ్ర ధ్రువీకరణ, భూమి మ్యూటేషన్లు, రేషన్/రైస్ కార్డులు, ఇల్లు స్థల పట్టాలు, వృద్ధాప్య ధ్రువీకరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, రెవెన్యూ వాటర్ టాక్స్, పట్టణ పరిపాలన సంబంధిత సేవలు,మత్స్యశాఖ సేవలకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. మిగిలిన ఇతర ప్రభుత్వ సేవలు మీసేవా కేంద్రాలలో అందుబాటులో ఉంటాయన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఛైర్మన్

కాలువలో పూడికతీత పనులు

ప్రజాశక్తి-పాయకరావుపేట:మండలంలోని శ్రీరాంపురం మురా కాలువలో పూడికతీత పనులను మురా కాలువ ఛైర్మన్ చింతలపు రామారావు చేపట్టారు. ఈ కాలువలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో రైతులకు సాగునీరు సరఫరాకు ఆటంకం కలుగుతోంది. కూటమి ప్రభుత్వం 32 లక్షలు గ్రాంటును ఈ కాలువ అభివృద్ధి కోసం విడుదల చేసింది. తుని నుంచి పాల్మన్ పేట వరకు వున్న ఈ కాలువలో 22 గేట్లును తిరిగి ఏర్పాటు చేస్తున్నామని ఛైర్మెన్ చింతలపు రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రెసిడెంట్ చింతలపు ప్రదీప్ (పద్దు), ఇరిగేషన్ శాఖ ఎఇ సురేష్ కుమార్, చింతలపు రాంబాబు, రాజుబాబు, మురా కాలువ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి-గొలుగొండ: నర్సీపట్నం రూరల్ సిఐ ఎల్.రేవతమ్మ శనివారం కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పల్లావూరు, పరిసర ప్రాంతాల్లో ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. భీమవరం చెక్ పోస్టు, బంగారంపేట జంక్షన్, సిహెచ్.నాగాపురం వెళ్లే మార్గాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ, గంజాయి అక్రమ రవాణా నిరోధానికి ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టామన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-గొలుగొండ:ప్రమాదవశాత్తు మేడ మీద నుంచి పడిన వృద్ధుడు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు తెలిపారు. మండలం ఏఎల్.పురం గ్రామానికి చెందిన లగుడు అప్పలనాయుడు(66) బుధవారం రాత్రి ఇంటి మేడపై పడుకుని తెల్లవారుజామున మేడ నుంచి దిగుతుండగా పిట్టగోడ లేనందున ప్రమాదవశాత్తు కాలుజారి సీసీ రోడ్డు పై పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయం కాగా 108 ద్వారా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య సేవలకై విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా వైద్యసేవలు పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు.మృతుడు భార్య సత్యవతి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'గ్రానైట్ క్వారీపై పర్యవేక్షణ ఏదీ'?

ప్రజాశక్తి-రావికమతం: మండలంలోని కవగుంట సమీపంలో ఉరలోవ కొండపై గ్రానైట్ క్వారీని నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నా పర్యవేక్షణ పూర్తిగా కరువైందని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, క్వారీలో రాత్రి, పగలు అన్న తేడా లేకున్నా బ్లాస్టింగ్లు చేయడంతో ఇళ్లలో సామగ్రి క్రింద పడటంతో ఒక్కసారిగా ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు.గ్రానైట్ క్వారీ సమీపంలో భూముల్లో గ్రానైట్ బుగ్గి చేరడంతో చౌడు భూములుగా తయారయ్యి పంటల పండని పరిస్థితి నెలకొందన్నారు. కొండలపైన ఉన్న చెట్లను, కొండలను పిండి చేస్తూ కోట్లాది రూపాయలు క్వారీ యజమానులు సొమ్ము చేసుకుం టున్నారని తెలిపారు. రావికమతం నుంచి ఘాట్ రోడ్డుకు వెళ్లే రోడ్డుకు ఈ క్వారీ సమీపంగా ఉండటంతో పలువురు ఆందోళన చెందుతున్నారన్నారు.

అస్తవ్యస్తంగా ఆరిలోవ రోడ్డు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఆరిలోవ రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. గతంలో ఈ రోడ్డు చాలా ఇబ్బంది కరంగా ఉండటంతో గత ప్రభుత్వంలో ఈ రోడ్డు వేసింది. మధ్యమధ్యలో కల్వర్టులు నిర్మించేందుకు కొంత మేర రోడ్డు తారు వేయకుండా వదిలేసారు. ఇప్పుడు ఈ ప్రాంతంలో మధ్య ఉన్న రోడ్డు ప్రమాదకరంగా గుంతలు ఏర్పడింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం, అధికారులు ఈ గుంతలను సరిచేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు. వర్షంకు బురదతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. గొలుగొండ మండలం, కొయ్యూరు ప్రాంతాల ప్రజలు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు ఇప్పటికైనా ఈ రోడ్డును సరి చేయాలని కోరుతున్నారు.



అస్తవ్యస్తంగా ఆరిలోవ రోడ్డు

గీతంలో ముగిసిన ఎఫ్‌డిపి

ప్రజాశక్తి-మధురవాడ : సైబర్ ముప్పును ఎదుర్కొనే పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్ కంప్యూటింగ్ (సి-డాక్) సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న సైబర్ సెక్యూరిటీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం (ఎఫ్‌డిపి) శనివారం ముగిసింది. ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పరిశ్రమల నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి-డాక్ అసోసియేట్ డైరక్టర్, శాస్త్రవేత్త కె.ఇంద్రవేణి, ప్రాజెక్టు డైరక్టర్ మహ్మద్ ఇర్ఫాన్ మాట్లాడుతూ, విద్యా సంస్థలు సైబర్ భద్రత సిద్ధాంత, మానవ వనరుల అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ప్రస్తుతం ఉన్న భద్రత లోపాలు, కృత్రిమ మేధ ఆధారిత సైబర్ ముప్పు, డిజిటల్ మౌలిక సదుపాయాలు భద్రత ప్రాముఖ్యత గురించి వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ అరుణ్ కుమార్ డిజిటల్ భద్రత పెంపునకు, సైబర్ సెక్యూరిటీలో అకడమిక్ ఇండస్ట్రీ సహకారాన్ని బలపర్చడంలో గీతం చేస్తున్న కృషిని వివరించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ జి.లక్ష్మీశ్వరి, సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ కె.నవీన్‌కుమార్, డాక్టర్ విక్రమ్‌ధీమాన్ పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.



సర్టిఫికెట్లు ఇస్తున్న శాస్త్రవేత్తలు

నిరంతర కృషి ద్వారానే లక్ష్య సాధన

ప్రజాశక్తి -తగరపువలస : నిరంతర కృషి ద్వారానే లక్ష్యాన్ని సాధించుకోవచ్చని అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ విద్యార్థులకు సూచించారు. కళాశాలలో మేనేజ్‌మెంట్ స్టడీస్ చివరి ఏడాది పూర్తిచేసిన విద్యార్థులకు శనివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మేనేజ్‌మెంట్ విద్య అభ్యసించిన విద్యార్థులు ఉద్యోగ అన్వేషణలో ఉండాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ యు.రాము మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ చదువుతో పాటు మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. తల్లి దండ్రులను గౌరవించాలని, భవిష్యత్తులో ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

పంపు హౌస్ వర్కర్లకు రెండు నెలల జీతాలు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని 19 గ్రామాల్లో గ్రామీణ తాగునీటి సరఫరా విభాగంలో సిపిడబ్ల్యుఎస్ స్కీం కింద పనిచేస్తున్న పదిమందికి రెండు నెలల జీతాలను విడుదలచేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జీతాలు లేక అర్ధాకలితో అలమటిస్తున్నారని, దీనిపై ధర్నాకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రజాశక్తిలో శనివారం ప్రచురితమైన వార్తకు పద్మనాభం మండల ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ హరీష్, ఉన్నతాధికారులు స్పందించారు. కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేయడంతో రెండు లక్షలు చెక్కును శనివారం సిబ్బందికి అందజేశారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది జంక్షన్లో ఉన్న మసీదులో శనివారం బక్రీద్ వేడుకలు సందర్భంగా ఇమామ్ షేక్ నాజర్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు మహమ్మద్ ప్రవక్తకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిములు ప్రత్యేక వంటకాలు తయారు చేశారు. కూటమి నేతలు దొండా గిరిబాబు, సాయి, శిరిగిరి శెట్టి శ్రీరామూర్తి, సయ్యపురెడ్డి శ్రీనివాస్, వీర్ల సురేష్, షేక్ రసూల్ ముస్లిములకు శుభాకాంక్షలు తెలిపారు.

కశింకోట : కశింకోట నూరి మసీదులో బక్రీద్ వేడుకలు శనివారం ముస్లిములు ఆనందంగా జరుపుకున్నారు. మత గురువు జియా హుల్ రెహమాన్ సమక్షంలో పవిత్ర ప్రార్థనలు జరిగాయి. టిడిపి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు, నూరి మసీదు నూతన అధ్యక్షులు షేక్ కరీముల్లా రెహమాన్ (బాబర్) మాట్లాడారు. కార్యక్రమంలో మసీదు పెద్దలు షెహద్ రెహమ్ తుల్లా , హాజీ హసన్ మాస్టారు, ఎంఎ రబ్బాని, ఎస్ఎంఎంఎ అలీ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలోని ముస్లిం గ్రామాల్లో శనివారం బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద బోదిగల్లం ఈద్గా వద్ద పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు హాజరై ప్రార్థన చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు. గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో బక్రీద్ పండగను శనివారం ముస్లిములు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వన్ టౌన్ పెర్రీ రోడ్డులో ఈద్గాలో ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రార్థనలో పాల్గొన్నారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని అన్నారు. ముస్లిం కుటుంబ సభ్యులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సాధిక్, పెద్దలు లడ్డు బాయ్, హీరా, హనీఫ్‌తో పాటు జనసేన వార్డు అధ్యక్షులు చిన్నా, ముస్లిములు పాల్గొన్నారు.


వడ్డాదిలో ప్రార్థనలు చేస్తున్న నేతలు, ముస్లిములు

సీతమ్మధార : బక్రీద్ పండగను పురస్కరించుకుని జివిఎంసి 26వ వార్డు పరిధి చెన్నూరు మసీదు వద్ద ముస్లిం పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.





కంచరపాలెంలోని ఓ ప్రయివేటు స్కూల్

విద్యా బోధనలో చిన్న విద్యాసంస్థలు భేష్

కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా సేవలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సూర్యుడు పగలు మాత్రమే వెలుగు, చంద్రుడు రాత్రి మాత్రమే వెలుగు.. అక్షరాలు రేయింబవళ్లు వెలుగు. ఈ వాస్తవాన్ని అన్ని తరగతుల ప్రజలూ వంట పట్టించుకున్నారు. అందుకే తమ పిల్లలను బాగా చదివించాలని, ఉన్నత ఉద్యోగులుగా చూడాలని లేదా కనీసం తమపై ఆధారపడకుండా జీవనం సాగించే స్థాయికి చేర్చాలని ఆశపడుతున్నారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు, ఎగువ మధ్య తరగతి ప్రజలు వారి పిల్లలను పెద్ద పెద్ద కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేర్పిస్తున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల భారం, ఇతర ఖర్చులు అధికంగా ఉంటాయని తెలిసి కూడా అటువైపే మొగ్గు చూపుతున్నారు. అయితే దిగువ మధ్య తరగతి, పేద తరగతికి చెందిన ప్రజలు మాత్రం తమ పిల్లలను ఫీజులు భారాన్ని భరించలేక ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించడం లేదా తక్కువ ఫీజుతో పాఠాలు బోధించే చిన్న చిన్న ప్రైవేట్ స్కూళ్లలో చేర్పించడానికి సిద్ధపడుతున్నారు. విశాఖ నగరంలో 400 వరకు ప్రైవేట్ విద్యాసంస్థలు ఉన్నాయి. వీటిలో 150 వరకు కార్పొరేట్ విద్యాసంస్థలే ఉన్నాయి. ఒక్కొక్క కార్పొరేట్ విద్యాసంస్థకు కనీసం 10 నుంచి 20 వరకు బ్రాంచిలు ఉంటున్నాయి. 50 వరకు మధ్య తరగతి విద్యాసంస్థలు ఉన్నాయి. ఇటువంటి ప్రైవేట్, మధ్యతరగతి విద్యాసంస్థలు రెండు నుంచి నాలుగు బ్రాంచిలు వరకు ఏర్పాటు చేసుకొని ముందుకు సాగుతున్నాయి. ఇవన్నీ పోగా మరొక 200 వరకు చిన్న చిన్న స్కూల్స్ నగర పరిధిలో ఉన్నాయి. వీటికి బ్రాంచి ఉండదు. ఇటువంటి స్కూల్ నిర్వహిస్తున్న వారు దాదాపు అందరూ అదే స్కూలులో ఉపాధ్యాయునిగా కూడా బాధ్యత నిర్వహిస్తుంటారు. ఈ స్కూళ్లలో చదివే పిల్లల ఫీజుల ద్వారా వచ్చే మొత్తాలే వీరికి ఆదాయం. ఇటువంటి చిన్న స్కూల్స్ నిర్వహిస్తున్న వారు కొన్ని తరగతులను బోధించడానికి తక్కువ వేతనంతో పనిచేయడానికి ఆసక్తి చూపే బోధకులను నియమించుకుంటారు. స్కూలు నిర్వహిస్తున్న ప్రదేశానికి చుట్టుపక్కల ఉన్న పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాల పిల్లలు తమ స్కూల్లో చేర్చాలని, తాము సరైన బోధన చేస్తామని, ఫీజులు భారం లేకుండా చూస్తామని చెప్పి ఒప్పించి పిల్లలను చేర్పించుకుంటారు. అంటే, ఇటువంటి స్కూళ్లలో ఫీజుల భారం మోయలేనంతగా మాత్రం ఉండదు. చెల్లించగలిగే విధంగానే ఉంటుంది అని చెప్పవచ్చు. ప్రీ ప్రైమరీ స్థాయి నుంచి విద్యాబోధన ఇటువంటి స్కూళ్లలోనే చేయించడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తుంటారు. ఉపాధి కోసం విద్యాసంస్థలు ప్రారంభించే వ్యక్తి ఉపాధ్యాయునిగా వ్యవహరిస్తూ, తన ఉపాధికి భంగం లేకుండా, క్వాలిటీ విద్యను అందించేందుకు నిత్యం ప్రయత్నిస్తుంటాడు. అదే సందర్భంలో తమ స్కూలులో చదివే ప్రతి విద్యార్థి చదువు పట్ల వ్యక్తిగత శ్రద్ధ వహిస్తూ, అన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. అదే సందర్భంలో స్కూలులో చదివే పిల్లల తల్లిదండ్రులతో ఎంతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారిని గౌరవిస్తూ స్కూల్‌కి, తనకు మంచి పేరు రావాలని భావిస్తుంటారు. ఇటువంటి స్కూళ్లలో ప్రాథమిక విద్య సాగించిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారనే విషయం తెలియడంతో పెద్దపెద్ద కార్పొరేట్ విద్యా సంస్థలకు చెందిన ప్రతినిధులు అటువంటి విద్యార్థుల తల్లిదండ్రుల ఇళ్లకు స్వయంగా వెళ్లి, వారిని తమ స్కూళ్లలో చేర్పిస్తే ఫీజులు తగ్గిస్తామని, ఇతర ఖర్చుల భారం లేకుండా చూస్తామని హామీ ఇస్తూ, అటువంటి పిల్లలను ఆకర్షించే పని జరుగుతోంది. అంటే ఒక విధంగా చెప్పాలంటే బడా కార్పొరేట్ విద్యాసంస్థలకు ఫీడ్ బ్యాక్ చిన్న చిన్న విద్యాసంస్థల నుంచే ఉంటుంది అని భావించవచ్చు.

చిన్న చిన్న విద్యాసంస్థలలో నిర్వహించే వార్షిక సమావేశాలు, వివిధ సందర్భాలలో నిర్వహించే పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసే కార్యక్రమానికి స్థానికంగా ఉన్న వీధి పెద్దలను, కార్పొరేటర్ వంటి నాయకులను పిలిచి గౌరవించడం చేస్తుంటారు. దీంతో అటువంటి పెద్దలు, స్థానిక నాయకులు ఇటువంటి చిన్న స్కూళ్లను ప్రోత్సహిస్తూ వస్తున్నారు. ప్రభుత్వాలు ఇటువంటి స్కూళ్లను అన్నిరకాలుగా ప్రోత్సహించాల్సి ఉంది.

పలు స్కూళ్లలో 'పది'లో శత శాతం ఉత్తీర్ణత

కంచరపాలెం వద్ద ఎన్‌హెచ్ 5 చెంతనున్న గిరిశాస్ శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్, మర్రిపాలెంలో ఉన్న ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఇందిరానగర్ 2లో ఉన్న శ్రీవిద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఇందిరానగర్ 5లో ఉన్న వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్, దుర్గా నగర్‌లో ఉన్న సూర్య భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్, అక్కయ్యపాలెంలో ఉన్న శ్రీ గీత విద్యా మందిర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, చిన గదిలిలో ఉన్న ప్రకాష్ విద్యాలయం, లిటిల్ స్టార్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, మద్దిలపాలెంలో ఉన్న శ్రీ భావన విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, శివాజీ పాలెంలో ఉన్న అనుభవ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వంటివి టెన్త్‌లో శత శాతం ఫలితాలు సాధించి ఔరా అనిపించాయి.